ఐటీ సంస్థల ఆదాయం అదుర్స్

ముంబై, ఫిబ్రవరి 24: దేశీయ ఐటీ సంస్థలు అత్యధిక ఆదాయాన్ని ఆర్జిస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 282.6 బిలియన్ డాలర్లు, వచ్చే ఏడాది 300 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించే అవకాశాలున్నాయని నాస్కాం అంచనావేస్తున్నది. క్రితం ఏడాది వచ్చిన ఆదాయంతో పోలిస్తే 5.1 శాతం వృద్ధిని నమోదు చేసుకోనున్నదని నాస్కాం ప్రెసిడెంట్ రాజేశ్ నంబియార్ తెలిపారు. ఐటీ సర్వీసెస్ కంపెనీలు, బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ కంపెనీలు, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు, ఈ-కామర్స్ కంపెనీలు సంయుక్తంగా ఈ ఏడాది కొత్తగా 1.26 లక్షల మందికి ఉపాధి కల్పించాయన్నారు. దీంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 58 లక్షలకు చేరుకున్నారు. 2024లో అంతర్జాతీయ ఐటీ కంపెనీలు నమోదు చేసుకున్న 4.7 శాతం వృద్ధితో పోలిస్తే దేశీయ ఐటీ సంస్థలు అంతకంటే ఎక్కువ వృద్ధిని నమోదు చేసుకోనున్నట్లు పేర్కొంది. కంపెనీల ఆదాయం 4.3 శాతం ఎగబాకి 137.1 బిలియన్ డాలర్లకు చేరుకోనుండగా, బీపీఎం ఇండస్ట్రీ 4.7 శాతం వృద్ధితో 54.6 బిలియన్ డాలర్లకు, ఇంజినీరింగ్ రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌లో 7 శాతం వృద్ధితో 55.6 బిలియన్ డాలర్లకు చేరుకోనున్నది.

వాటాల అమ్మకంపై నజర్

సర్కారీ బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణపై కేంద్ర ప్రభుత్వం దృష్టి

సలహాల కోసం మర్చంట్ బ్యాంకర్లు,లీగల్ కంపెనీల నుంచి బిడ్ల ఆహ్వానం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: దేశీయ స్టాక్ మార్కెట్లలో నమోదైన సర్కారీ బ్యాంకుల్లో, ఆర్థిక సంస్థల్లో వాటాలను త్వరగా అమ్మేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ క్రమంలోనే దాని సహాయార్థం ఆయా మర్చంట్ బ్యాంకర్లు, లీగల్ కంపెనీల నుంచి దరఖాస్తులను ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ, పెట్టుబడుల శాఖ (దీపం) సోమవారం ఆహ్వానించింది. బిడ్ల దాఖలుకు మర్చంట్ బ్యాంకర్లకున్న ఆఖరు తేదీ మార్చి 27. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఉండే దీపం.. ప్రభుత్వ రంగ సంస్థల్లో సర్కారీ వాటాల నిర్వహణను పర్యవేక్షిస్తూ ఉంటుంది. అయితే ఇప్పటికీ కొన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లో.. మార్కెట్ రెగ్యులేటర్ సెబీ నిబంధనల ప్రకారం 25 శాతం కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ నిబంధన అమలు కావడం లేదు. దీంతో వచ్చే ఏడాది ఆగస్టు 1నాటికి ఆయా సంస్థల్లో ప్రభుత్వ వాటాలను తగ్గించుకోవాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నది. ఇందులో భాగంగానే మర్చంట్ బ్యాంకర్లు-సెల్లింగ్ బ్రోకర్లు.. ఏ సంస్థల్లో వాటాలను ఎంతమేర, ఏ ధరకు, ఎప్పుడు అమ్మాలన్నదానిపై ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వనున్నాయి.

90 శాతంపైనే

ప్రస్తుతం ఐదు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో కేంద్రం వాటా 90 శాతానికిపైగానే ఉన్నది. వాటిలో పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ (98.3 శాతం), ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ (96.4 శాతం), యూకో బ్యాంక్ 95.4 శాతం, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (93.1 శాతం), బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (86.5 శాతం) ఉన్నాయి. అలాగే ఆర్థిక సంస్థ ఐఆర్ఎఫ్‌సీలో 86.36 శాతం, బీమా కంపెనీలైన న్యూ ఇండియా అస్యూరెన్స్‌లో 85.44 శాతం, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌లో 82.40 శాతం చొప్పున కేంద్ర ప్రభుత్వానికి వాటాలున్నాయి. కాగా, 2021-22 బడ్జెట్‌లోనే ఐడీబీఐ బ్యాంక్‌గాక, రెండు ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణను కేంద్రం ప్రతిపాదించింది. ఐడీబీఐ ప్రైవేటీకరణ ప్రక్రియ ప్రస్తుతం జరుగుతున్న విషయం తెలిసిందే.

ఆస్తుల నగదీకరణలో భాగంగా జాతీయ రహదారుల నిర్వహణ సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) దేశవ్యాప్తంగా 24 రోడ్లను అమ్మకానికి పెట్టింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో పలు రాష్ట్రాల్లోవున్న ఈ రోడ్లకు సంబంధించి ఆస్తులను అమ్మకం ద్వారా రూ.1,863 కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందుకోసం పలు రాష్ట్రాల్లోవున్న 1,472 కిలోమీటర్ల జాతీయ రహదారులను గుర్తించింది. విక్రయించనున్న రోడ్డు ప్రాజెక్టులలో ఐదు మహారాష్ట్ర రాష్ట్రంలో ఉండగా, నాలుగు ఝార్ఖండ్, మూడు ఉత్తరప్రదేశ్‌లలో ఉన్నట్లు ఎన్‌హెచ్ఏఐ తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది. అలాగే తెలంగాణతోపాటు బెంగాల్, బీహార్ రాష్ట్రాల్లో రెండేసి చొప్పున రోడ్లు ఉండగా.. ఛత్తీస్‌గఢ్, హర్యానా, గుజరాత్, కర్ణాటక, కేరళ, ఒడిశాల్లో ఒక్కో రోడ్డు ప్రాజెక్టు ఉన్నాయి.

అమ్మకానికి 24 జాతీయ రోడ్లు

తక్కువ వడ్డీకే యూబీలో గృహ రుణాలు

ముంబై, ఫిబ్రవరి 24: రిజర్వు బ్యాంక్ కీలక వడ్డీరేట్లను పావు శాతం తగ్గించడంతో ఒక్కో బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గిస్తున్నాయి. ఇప్పటికే బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ, ఇతర బ్యాంకులు రెపో రేటుతో అనుసంధానమైన రుణాలపై వడ్డీరేట్లను తగ్గిస్తున్నాయి. దీంట్లోభాగంగా యూనియన్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్‌లు తమ గృహ రుణాలపై వడ్డీరేటును తగ్గించాయి. 20 ఏండ్ల కాలపరిమితితో గృహ రుణాలు తీసుకున్న వారికి ఈ రెండు బ్యాంకులు 8.10 శాతంవడ్డీకే రుణాలు అందిస్తున్నాయి. అంటే లక్ష రూపాయల రుణంపై ఈఎంఐ రూ.843గా నిర్ణయించింది. మిగతా బ్యాంకులు కూడా ఈ స్థాయిలోనే వడ్డీరేట్లను వసూలు చేస్తున్నాయి.

గృహ రుణాలపై వడ్డీరేటు

బ్యాంక్	వడ్డీరేటు (శాతంలో)	లక్ష రూపాయల రుణంపై ఈఎంఐ (20 ఏండ్లకు)
యూనియన్ బ్యాంక్	8.10	843
సెంట్రల్ బ్యాంక్	8.10	843
బ్యాంక్ ఆఫ్ బరోడా	8.15	846
పంజాబ్ నేషనల్	8.15	846
కెనరా బ్యాంక్	8.15	846
ఇండియన్ బ్యాంక్	8.15	846
ఎస్బీఐ	8.25	852
బ్యాంక్ ఆఫ్ ఇండియా	8.30	855
ఐడీబీఐ బ్యాంక్	8.50	868
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	8.75	884

హైదరాబాద్‌లో అమ్జెన్ నూతన కేంద్రం

హైదరాబాద్, ఫిబ్రవరి 24(నమస్తే తెలంగాణ): అమెరికాలోనే అతిపెద్ద బయో టెక్నాలజీ సంస్థ అమ్జెన్..హైదరాబాద్‌లో నూతన టెక్నాలజీ, ఇన్నోవేషన్ కేంద్రాన్ని ప్రారంభించింది. రహేజా నాలెడ్జ్ సిటీలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఐటీ-పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో రాబర్ట్ బ్రాడ్‌వే మాట్లాడుతూ..వ్యాపార విస్తరణలో భాగంగా ఈ నూతన సెంటర్‌ను నెలకొల్పినట్లు, భవిష్యత్తులో 200 మిలియన్ డాలర్లు(రూ.1,600 కోట్లకు పైమాటే) పెట్టుబడి పెట్టాలనుకుంటున్నట్లు చెప్పారు.

ఏఐలో పెట్టుబడులు పెట్టండి: శ్రీధర్ బాబు

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదిత 'ఏఐ సిటీ'లో పెట్టుబడులు పెట్టాలని ఆస్ట్రేలియా - క్వీన్స్‌లాండ్ ప్రభుత్వ ప్రతినిధులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. క్వీన్స్ లాండ్ రాష్ట్ర ఫైనాన్స్, ట్రేడ్, ఎంప్లాయ్ మెంట్ అండ్ ట్రైనింగ్ మంత్రి రాసిన్ బేట్స్ ఆధ్వర్యంలోని బృందం శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా 'తెలంగాణ-క్వీన్స్ లాండ్' మధ్య ప్రాధాన్య రంగాల్లో సంబంధాలను మెరుగుపర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు ఆయన తెలిపారు.

ఖనిజాల ఉత్పత్తికోసం అవగాహన

క్రిటికల్ మైనింగ్ రంగంలో పరస్పర సహకారం కోసం క్వీన్స్‌లాండ్ (ఆస్ట్రేలియా)తో రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యంకానుంది. 11 రకాల ఖనిజాల వెలికితీతలో పరస్పర సహకారం అందించుకోనున్నాయి.

రూ.4.23 లక్షల కోట్లు ఔట్

భారీ నష్టాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు

పెద్ద ఎత్తున ఆవిరైన మదుపరుల సంపద

సెన్సెక్స్ 857, నిఫ్టీ 243 పాయింట్లు క్షీణత

దెబ్బతీసిన ఎఫ్ఐఐ పెట్టుబడుల ఉపసంహరణ



ముంబై, ఫిబ్రవరి 24: దేశీయ స్టాక్ మార్కెట్లలో వరుస నష్టాలు కొనసాగుతున్నాయి. దీంతో మదుపరుల సంపద కూడా లక్షల కోట్ల రూపాయల్లో ఆవిరైపోతున్నది. సోమవారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 856.65 పాయింట్లు లేదా 1.14 శాతం పతనమై 75వేల మార్కుకు దిగువన 74,454.41 వద్ద ముగిసింది. ఫలితంగా బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ ఈ ఒక్కరోజే రూ.4,22,983.08 కోట్లు హరించుకుపోయి రూ.3,97,97,305.47 కోట్ల (దాదాపు రూ.398 లక్షల కోట్లు) వద్ద నిలిచింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 242.55 పాయింట్లు లేదా 1.06 శాతం కోల్పోయి 22,553. 35 వద్ద నిలిచింది.

అమ్మకాల ఒత్తిడి

ఉదయం ఆరంభం నుంచే సూచీలు భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. సమయం గడుస్తున్నకొద్దీ మదుపరులు పెట్టుబడుల ఉపసంహరణలకే పెద్దపీట వేశారు. దీంతో నష్టాలు మరింత పెరిగిపోయాయి. ఒకానొక దశలోనైతే సెన్సెక్స్ 923.62 పాయింట్లు దిగజారడం గమనార్హం. నిజానికి గత ఐదు రోజులుగా ఈక్విటీలు నేల చూపుల్నే చూస్తున్నాయి. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 1,542.45 పాయింట్లు, నిఫ్టీ 406.15 పాయింట్లు క్షీణించాయి. దీంతో ఆయా సంస్థల మార్కెట్ విలువ కూడా భారీగానే ఆవిరైపోతున్నది.

ఐటీ షేర్లు ఢమాల్

హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా తదితర ఐటీ రంగ షేర్లకు మదుపరులు దూరంగా ఉన్నారు. ఫలితంగా ఐటీ సూచీ 2.65 శాతం పడిపోయింది. జొమాటో, భారతీ ఎయిర్‌టెల్, టాటా స్టీల్, ఎన్టీపీసీ షేర్లూ కోలుకోలేకపోయాయి. రంగాలవారీగా టెలికం 2.26 శాతం, మెటల్ 2.16 శాతం, కమోడిటీస్ 1.53 శాతం, యుటిలిటీస్ 1.42 శాతం కుప్పకూలాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 1.31 శాతం, మిడ్‌క్యాప్ సూచీ 0.78 శాతం మేర నిరాశపర్చాయి.

ఇదీ సంగతి..

భారతీయ స్టాక్ మార్కెట్ల నష్టాలకు ప్రధాన కారణాల్లోకి వెళ్తే.. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు ముఖ్యంగా అమెరికా ఈక్విటీ నష్టాల ప్రభావం స్పష్టంగా కనిపించింది. దక్షిణ కొరియా, చైనా, హాంకాంగ్ వంటి ఆసియా దేశాల సూచీలూ నిరాశపర్చాయి. అలాగే విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) అదే పనిగా తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటుండటం కూడా దెబ్బతీసింది.

మళ్లీ 89వేలు దాటిన పుత్తడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: గత కొన్ని రోజులుగా తగ్గుతూ వచ్చిన బంగారం మళ్లీ ప్రియమైంది. అంతర్జాతీయ మార్కెట్లో అనూహ్యంగా ధరలు పుంజుకోవడంతో దేశీయంగా పుత్తడి ధర మళ్లీ రూ.89 వేల మార్క్‌ను అధిగమించింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో పదిగ్రాముల ధర రూ.350 ఎగబాకి రూ.89,100కి చేరుకున్నట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. గత శుక్రవారం గోల్డ్ రూ.88,750గా ఉన్న విషయం తెలిసిందే. అలాగే 99.5 శాతం కలిగిన పదిగ్రాముల ధర రూ.88,700కి చేరుకున్నది. అయినప్పటికీ వెండి ధరలు నిలకడగా నమోదయ్యాయి. కిలో వెండి లక్ష రూపాయల వద్ద స్థిరంగా ఉన్నది. రాజకీయ అస్థిరత, వాణిజ్య ఉద్రిక్తత నెలకొనడంతో మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన బంగారం వైపు మళ్లించడం వల్లనే ధరలు పెరుగుతున్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ వర్గాలు వెల్లడించాయి.

స్మార్ట్‌వాచీలకు గిరాకీ నై

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: దేశంలో స్మార్ట్‌వాచీలకు గిరాకీ తగ్గిపోయింది. గత ఏడాది భారత్‌కు వాటి సరఫరా 30 శాతం పడిపోయిందిమరి. వినియోగదారులకు సంతృప్తికర అనుభవం లేకపోవడం, కొరవడిన కొత్తదనం తదితర కారణాలే ఇందుకు కారణమని సోమవారం కౌంటర్‌పాయింట్ రిసెర్చ్ నివేదిక తెలిపింది. ఇది ఫైర్ బోల్ట్, బోట్, నాయిస్ కంపెనీలకు ఎదురుదెబ్బగా పేర్కొన్నది. ఫైర్ బోల్ట్ దిగుమతులు 54 శాతం పడిపోగా, బోట్ 47 శాతం, నాయిస్ 26 శాతం దిగజారాయి. నిరుడు దేశీయ స్మార్ట్‌వాచీ మార్కెట్‌లో నాయిస్ వాటా 27 శాతంగా ఉంటే, ఫైర్ బోల్ట్ 19 శాతం, బోట్ 13 శాతంగానే ఉన్నాయి. 2023లో ఫైర్ బోల్ట్ వాటా 30 శాతంగా, బోట్ వాటా 17 శాతంగా ఉండటం గమనార్హం. అయితే 2024లో టైటాన్‌కు చెందిన ఫాస్ట్‌ట్రాక్ స్మార్ట్‌వాచీల సరఫరా దేశీయ మార్కెట్‌లో 35 శాతం పెరగడం విశేషం. అలాగే రూ.20 వేలకుపైగా ధర కలిగిన స్మార్ట్‌వాచీలకూ మార్కెట్‌లో డిమాండ్ పెరిగిందని కౌంటర్‌పాయింట్ చెప్పింది.

సమావేశంలో తెలంగాణ డిప్యూటీ సీఎం, క్వీన్స్ లాండ్ అధికారులు, సింగరేణి సీఎండీ

కీలక ఖనిజాల మైనింగ్‌కు తెలంగాణ భాగస్వామ్యం

గోదావరిఖని, ఫిబ్రవరి 24: క్వీన్స్ ల్యాండ్(ఆస్ట్రేలియా) ప్రభుత్వంతో కీలక ఖనిజాల టెక్నాలజీ, మైనింగ్ రంగంలో తెలంగాణ భాగస్వామ్యంకు ముందడుగు వేసింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సోమవారనం జరిగిన క్వీన్స్ ల్యాండ్ రాష్ట్ర ఆర్థిక, వాణిజ్య, ఉపాధి, శిక్షణశాఖ మంత్రి రోస్ బేట్స్, అ రాష్ట్ర అధికారుల బృందంతో నిర్వహించిన కీకల ఖనిజాల ఉత్పత్తి, వ్యాపార విస్తరణ అవకాశాల సమావేశంలో ఉత్పత్తి, విక్రయానికి పరస్పర లబ్ధి చేకూరే వ్యాపార ఒప్పందంపై ప్రాథమికంగా అవగాహనకు వచ్చినట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. తెలంగాణతో పాటు దేశంలో విద్యుత్ వాహనాలు, సోలార్ విద్యుత్, బ్యాటరీ స్టోరేజ్ విధానాలకు డిమాండ్ నేపథ్యంలో ఈ రంగానికి అవసరమైన కోబాల్ట్, ఇండియం, క్రోమియం, టైటానియం వంటి 11 రకాల కీలక ఖనిజాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు వివరించారు. ఈ క్రమంలో ఈ ఖనిజాల లభ్యత క్వీన్స్ లాండ్‌లో అధికంగా ఉన్నందున వీటి ఉత్పత్తి, విక్రయానికి అవగాహనకు వచ్చినట్లు డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ఇక్కడ క్వీన్స్ లాండ్ ప్రభుత్వ అధికారులు, సింగరేణి సీఎండీ బలరాం నాయక్, డైరెక్టర్లు సత్యనారాయణరావు, ఎల్‌వీ సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మైమెంట్, జీఎం కోఆర్డినేషన్ ఎస్‌డీఎం సుభాని, జీఎం ఉన్నారు.

కాంగ్రెస్ నాయకులకు కోడ్ వర్తించదా...?

రామగిరి, ఫిబ్రవరి 24 ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ నాయకులు విస్మరించారు. మంత్రి శ్రీధర్ బాబు సోదరుడు శ్రీనుబాబు జన్మదినం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘించడం కాదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. సోమవారం మండలంలోని నాగెపల్లి, బేగంపేట తదితర గ్రామాల్లో గల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేయడం స్థానికంగా చర్చనీయాశంగా మారింది. అధికారులు చోద్యం చూస్తుండడం కూడా విమర్శలకు తావిచ్చింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై, అందుకు సహకరిస్తున్న అధికారులపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో మినీ లైబ్రరీ

మంథని రూరల్, ఫిబ్రవరి 25: మండలంలోని కన్నాల గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సింగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన అన్నదమ్ములు చిగిరి శివకుమార్, సాయికుమార్ మినీ లైబ్రరీని సోమవారం ఏర్పాటు చేశారు. ఈ మినీ లైబ్రరీలో సనాతన సంస్థ సనాతన ధర్మం, ఆధ్యాత్మికత, ఆధ్యాత్మిక సాధన, జాతీయ సంక్షేమంపై రాసిన పుస్తకాలు అందుబాటులో ఉంచారు. భక్తులు ఈ గ్రంథాలను అర్థం చేసుకోవడానికి సహాయపడటానికి ప్రత్యేక పుస్తకాల ద్వారా సమాచారం పంచుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూజారి ముఖేష్ శర్మతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంతింతై.. ఖోఖో కోచ్‌గా ఎదిగి

ఇటీవల విశ్వవిజేత జట్ల శిక్షకుడు లంబాడి తండా బిడ్డే

క్రీడాకారులకు సూచనలు ఇస్తున్న ఖోఖో జాతీయ సహాయ కోచ్ నరేష్

- బాల్యం నుంచే స్వదేశీ క్రీడలో ఇస్లావత్ నరేశ్ నాయక్ ప్రతిభ
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాల పంట
- రైల్వే శాఖలో ఉద్యోగం.. శిక్షకుడిగా నియామకం
- అతని సారథ్యంలో ఇటీవల దేశానికి రెండు వరల్డ్ కప్‌లు

ఖోఖో ఛాంపియన్ ట్రోఫీతో ఖోఖో జాతీయ సహాయ కోచ్ నరేష్

ఢిల్లీలో జరిగిన ఖోఖో క్రీడలో ప్రపంచ ఛాంపియన్ షిప్ సాధించిన క్రీడాకారులతో నరేష్ నాయక్

ధర్మారం, ఫిబ్రవరి 24: బాల్యం నుంచే ఖోఖో క్రీడ పై ఉన్న మక్కువ అతన్ని క్రీడా ఆణిముత్యంగా నిలిపింది. చదువుకునే రోజుల్లోనే ఎన్నో ఆటుపోట్లు ఎదురైనా పట్టుదలతో చేసిన సాధన ది బెస్ట్ స్పోర్ట్స్‌మెన్‌గా మార్చింది. ఖోఖో రాణించి, అనేక పథకాలు సాధించిన ధర్మారం మండలం బంజరుపల్లి లంబాడితండా (బీ) గ్రామానికి చెందిన ఇస్లావత్ నరేశ్‌నాయక్ రైల్వే శాఖలో కొలువు సాధించి, కోచ్‌గా నియమితులై అనేక జట్లకు తర్ఫీదునిచ్చాడు. ఇటీవలే జాతీయ సహాయ శిక్షకుడిగా నియమితులై, తన మెళకువలతో పురుషులు, మహిళల విభాగాల్లో దేశానికి రెండు ప్రపంచకప్ టైటిల్స్‌ను తెచ్చిపెట్టాడు. మన దేశ ఖోఖో క్రీడాఖ్యాతిని ప్ర పంచానికి చాటిచెప్పిన నరేశ్‌పై 'నమస్తే' ప్రత్యేక కథనమిది.

తండాలో పుట్టి.. ఖోఖోలో ఆరితేరి..

బంజరుపల్లి లంబాడి తండా (బీ) గ్రామానికి చెందిన ఇస్లావత్ సంతారి, రూపా నాయక్ దంపతులకు ఇద్దరు కొడుకులు శ్రీనివాస్, నరేష్. శ్రీనివాస్ ధర్మారం ప్రభుత్వ పాఠశాల టీచర్. రెండోవాడైన నరేష్ బాల్యం నుంచే ఖోఖోపై ఆసక్తి పెంచుకున్నాడు. ప్రాథమిక విద్యాభ్యాసాన్ని పూర్తిగా ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే పూర్తిచేశాడు. 1995లో టెన్త్ పూర్తి చేశాడు. 2002లో కాకినాడలో ఇంటర్ పూర్తి చేశాడు. 2005లో కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేశాడు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ చేశాడు. కాగా, నరేష్ 1996లో హుస్నాబాద్ గురుకుల విద్యాలయంలో చదువుతున్న టైంలోనే కర్నాటకలో తెలంగాణ జట్టు తలుపున ఆడి ప్రథమ స్థానంలో నిలిచి తన విజయ ప్రస్థానాన్ని మొదలుపెట్టాడు. 2000లో పంజాబ్‌లోని సంగాపూర్, 2001లో మహారాష్ట్రలో జరిగిన సీనియర్ నేషనల్ క్రీడలో సత్తాచాటాడు. 2006లో ఉత్తర ప్రదేశ్‌లో జరిగిన సీనియర్ నేషనల్ ఇండియన్ రైల్వే టీం తరపున గోల్డ్ మెడల్ సాధించాడు. 2001లో పంజాబ్‌లోని పార్టీయాల, 2002లో హైదరాబాదులో జరిగిన నేషనల్ క్రీడల్లో రాష్ట్ర తరపున ఆడి బ్రాంచ్ మెడల్స్‌ను కైవసం చేసుకున్నాడు. తర్వాత రైల్వే శాఖ తరపున ఆడి లెక్కలేనన్ని పథకాలు సాధించాడు.

స్పోర్ట్స్ కోటాలో రైల్వేలో ఉద్యోగం

నరేష్ ఖోఖోలో ప్రతిభచూపి ఎన్నో పతకాలు సాధించడంతో రైల్వే శాఖలో ఉద్యోగం వరించింది. సౌత్ ఇండియా రైల్వే విభాగంలో 2006లో మెకానిక్ విభాగంలో సీనియర్ టెక్నీషియన్‌గా మహారాష్ట్రలోని నాందేడ్‌లో నియమిలయ్యారు. ప్రస్తుతం సికింద్రాబాద్‌లోని లాలాగూడలో చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఆ తర్వాత రైల్వే శాఖలో ఖోఖో క్రీడా కోచ్‌గా నియమితులైన నరేశ్, ఆ శాఖ ద్వారా ఎన్నో పతకాల సాధనకు కృషి చేశాడు. నరేష్ శిక్షణతో ఖోఖోలో 2006 నుంచి 2023 వరకు వివిధ రాష్ట్రాలలో జట్లు సత్తా చాటాయి.

జాతీయ సహాయ కోచ్ ప్రస్థానం

నరేష్ ఖోఖో క్రీడలో జాతీయ సహాయ కోచ్‌గా నియమితులై తన సత్తా చాటాడు. ప్రపంచ చాంపియన్ షిప్‌ను దేశానికి సాధించి పెట్టడంలో విజయవంతమయ్యాడు. 2024 డిసెంబర్ 10న ఖోఖో క్రీడా సహాయ కోచ్ నియమితులైన వెంటనే, అదే రోజు, మరుసటి రోజు వరల్డ్ కప్ పోటీల కోసం 60 మంది మహిళలు, 60 మంది పురుషులకు వేర్వేరుగా నైపుణ్య పరీక్షలు నిర్వహించాడు. అత్యంత ప్రతిభచూపిన 15 మంది చొప్పున మహిళలు, పురుష జట్లకు 30 మందిని ఎంపిక చేశాడు. పోటీలకు సన్నద్ధం చేశాడు. ఈ నెల 13 నుంచి ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో వరల్డ్ కప్ జరుగగా, సుమారు 26 దేశాల నుంచి 50 ఖోఖో జట్లు పాల్గొన్నాయి. ఇందులో మన దేశ మహిళలు, పురుషుల జట్లు సత్తా చాటి ప్రపంచ ఖోఖో చాంపియన్‌షిప్‌ను సాధించాయి.

ఈ విజయం ఖోఖో క్రీడాకారులకు అంకితం

నా శిక్షణలో ఖోఖో క్రీడలో దేశంలోని మహిళలు, పురుషుల జట్లు ఒకే సమయంలో ప్ర పంచ ఛాంపియన్ షిప్ ట్రోఫీని సాధించ డం ఎంతో ఆనందంగా ఉంది. ఈ విజయాన్ని ఖోఖో క్రీడాకారులకు అంకితం ఇస్తున్న. నా శిక్షణలో వరల్డ్ చాంపియన్‌షిప్ సాధించడంతో ఎంతో గర్వంగా ఉంది. ఈ గ్రామీణ క్రీడకు ప్రపంచ ఖ్యాతి దక్కడం ఆనందంగా ఉంది. ఖోఖోలో రాణించిన వారికి జాతీయ స్థాయి గుర్తింపు దక్కడమే కాదు ప్రభుత్వ ఉద్యోగాలు వరిస్తాయి.

-నరేష్, జాతీయ సహాయ కోచ్

యువకుడి ఆత్మహత్యాయత్నం

ముత్తారం, ఫిబ్రవరి 24; మండలంలోని కేశనపల్లి గ్రామానికి చెందిన కలవేన రమేశ్(26) ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కలవేన స్వరూప- చంద్రమౌళిల కుమారుడు రమేశ్ గ్రామంలో నివసిస్తున్నాడు. సోమవారం సాయంత్రం తన వ్యవసాయ క్షేత్రంలో పురుగుల మందు తాగగా, గమనించిన కటుంబ సభ్యులు చికిత్స కోసం పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. రమేశ్‌కు మార్చి రెండో తేదీన వివాహం నిశ్చయమైంది. ఆత్మహత్యయత్నానికి గల కారణాలు తెలియరాలేదు. పూర్తి వివరాలు తెలియాల్సిఉంది.

వివాహ వేడుకలకు హాజరు

ముత్తారం, ఫిబ్రవరి 24: మండల కేంద్రంలో బీఆర్ ఎస్ నాయకుడు రాగుల భాగ్యలక్ష్మి - రాజేశం పటేల్ పుత్రుడు రాజు పటేల్ వివాహ వేడుకలకు మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. ఇక్కడ బీఆర్ ఎస్ మండల అధ్యక్షుడు పోతుపెద్ది కిషన్ రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుధాడి రవీందర్ రావు, సర్పంచ్ లఫోరం మాజీ మండల అధ్యక్షుడు నూనే కుమార్, సింగిల్ విండో డైరెక్టర్ గిరి విరేందర్, బీఆర్ ఎస్ నాయకులు అలువోజు రవీందర్ , జంగా వెంకట్ రెడ్డి, ఎర్రం సదానందం, గాదం శ్రీనివాస్, తిత్తుల శ్రీనివాస్ , శంకర్ , రాజయ్య, సారయ్యలు, బాలమల్లు, రాములు పాల్గొన్నారు.

న్యాయవాదిపై సీఐ దురుసు ప్రవర్తన

- బార్ అసోసియేషన్‌కు ఫిర్యాదు

ఫర్టిలైజర్‌సి